www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 18 మార్చి 2025
5
తూర్పుగోదావరి

హెల్త్ సెంటర్ అభివృద్ధికి రూ.15 లక్షల విరాళం

ప్రజాశక్తి - రాజానగరం

ఆదికవి నన్నయ యూనివర్సిటీ హెల్త్ సెంటర్ అభివృద్ధికి తోట హరిబాబు జ్ఞాపకార్థం వారి కుమారుడు డాక్టర్ తోట సుబ్రహ్మణ్యం రూ.15 లక్షలు విరాళం ఇచ్చారని విసి ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. కాకినాడకు చెందిన ఎలైట్ నేచురల్ ఆయిల్స్ అండ్ ఫ్యూయెల్స్ ప్రైవెటు లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ టి.సుబ్రహ్మణ్యం సోమవారం ఆదికవి నన్నయ యూనివర్సిటీలో జరిగిన అంతర్జాతీయ సెమినార్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా విసితో విశ్వవిద్యాలయ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై ఆయన చర్చించారు. యూనివర్సిటీలోని హెల్త్ సెంటర్ అభివద్ధికి తన వంతు సాయంగా రూ. 15 లక్షలు విరాళంగా ప్రకటించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యంను విశ్వవిద్యాలయం తరుపున విసి సన్మానించారు.

నిబంధనలా..మాకెందుకు..?

-వ్యాపారాల్లో యథేచ్ఛగా డొమెస్టిక్ సిలెండర్లు
-కమర్షియల్ గ్యాస్ వినియోగం అరకొరే
-తనిఖీలు చేయని పౌరసరఫరాల శాఖ.?

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

గృహ అవసరాలకు వాడే డొమెస్టిక్ గ్యాస్ సిలెండర్లు పక్కదారి పడుతున్నాయి. నిబంధనల ప్రకారం వాటిని వ్యాపార సంస్థలలో వినియోగించడానికి వీలు లేదు. అయితే అధికారులు నిర్లక్ష్యం వలన వ్యాపారులు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. యథేచ్ఛగా వాటిని వినియోగిస్తున్నారు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సుమారు 16.77లక్షల మంది గ్యాస్ వినియోగదారులున్నారు. వీరిలో గృహ అవసర వినియోగదారులు దాదాపు 15.10 లక్షల మంది ఉన్నారు. నెలకు సరాసరి 7.5 లక్షల గ్యాస్ సిలెండర్ల వినియోగం ఉంటుంది. వాణిజ్య

కాకినాడలో ఒక వ్యాపార కేంద్రంలో డొమెస్టిక్ గ్యాస్ వినియోగం

గ్యాస్ కనెక్షన్లు సుమారు లక్ష వరకు ఉన్నాయి. వ్యాపార పనులకు వినియోగించే వాణిజ్య గ్యాస్ కనెక్షన్ల సంఖ్యకు అనుగుణంగా నిబంధనల మేరకు వినియోగం ఉండడం లేదు. 19 కేజీలు, 5 కేజీల గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.

విచ్చలవిడిగా వినియోగం

టీ, కాఫీ, టిఫిన్ హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, చికెన్ సెంటర్లు, భజ్జీ కొట్లు, కళ్యాణ మండపాలు ఇలా అనేక వ్యాపార సంస్థలు వద్ద ఇబ్బడిముబ్బడిగా డొమెస్టిక్ సిలెండర్లనే వాడుతున్నారు. కాకినాడ, రాజమహేంద్రవరం, మండపేట, పిఠాపురం, తుని, అన్నవరం, సామర్లకోట, పెద్దాపురం, అమలాపురం ఇలా పలు చోట్ల ఎక్కువగా వందల్లో వ్యాపారులు గ్యాస్ సిలెండర్లను ఇష్టారీతిన తమ వ్యాపార అవసరాలకు వినియోగిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపుగా 60 నుంచి 70 వేల వరకూ గ్యాస్ ఉపయోగించే దుకాణాలు ఉంటాయి. ఈ సంఖ్యకు అనుగుణంగా వాణిజ్య సిలిండర్లను వాడాల్సి ఉండగా కేవలం వందల్లోనే వీటిని వినియోగిస్తున్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గృహ అవసరాలకు వాడే సిలెండర్లను మాత్రమే ఉపయోగిస్తున్నారు. ఎక్కడ చూసినా వీటి వినియోగమే ఎక్కువగా కనిపిస్తుంది. బహిరంగంగానే డొమెస్టిక్ బండలను వాడుతున్నా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తుండడం పలు అనుమానాలకు తావిస్తోంది. గ్యాస్ ఏజెన్సీలు నిబంధనలను పక్కనపెట్టి గృహ అవసర సిలిండర్లను వాణిజ్య దుకాణాలకు సైతం వేస్తుండడంపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వాణిజ్య బండలను వినియోగించాలని నిబంధనలు ఉన్నా పౌరసరఫరాల శాఖ అధికారులు సైతం పట్టించుకోవడం లేదు. వీటిపై ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాల్సి ఉంది. అయితే నామమాత్రపు తనిఖీలతోనే సరిపెడుతూ మామూళ్ల మత్తులో ఉన్నారన్న ఆరోపణలు సంబంధిత శాఖ అధికారులపై వినిపిస్తున్నాయి. సిలిండర్లను సరఫరా చేసే కొంతమంది సిబ్బంది వంట గ్యాస్‌ను వాణిజ్య అవసరాలకు విక్రయిస్తున్నారు. ఇదంతా ఏజెన్సీల కనుసన్నల్లోనే జరుగుతోంది.

ప్రస్తుతం వాణిజ్య సిలిండర్ రూ.2వేలకు పైనే ఉంది. గృహ అవసరాల సిలెండర్ రూ.870 ఉండడంతో కొందరు మామూళ్లకు అలవాటు పడి వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. ధరలో సగానికి పైగా తేడా ఉండడంతో వ్యాపారులు డొమోస్టిక్ బండలపైనే మక్కువ చూపుతున్నారు. మరోవైపు అటు వినియోగదారులపై సైతం అధిక ధరలకు ఆహార పదార్థాలను విక్రయిస్తున్నారు. ఈ వ్యవహారంపై పలుమార్లు ఫిర్యాదులు వెళుతున్నా అధికారులు అటు వైపు కన్నెత్తి చూడకపోవడం విశేషం. ఈ నేపథ్యంలో పక్కదారి పడుతున్న గృహ వినియోగ సిలిండర్ల విషయంలో అధికారులు ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

తనిఖీలు ముమ్మరం చేస్తాం

గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లు అక్రమంగా వాడితే చట్టరీత్యా నేరం. నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. నిరంతరం తనిఖీలు చేస్తున్నాం. ఫిర్యాదులు వస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం. ఈ నెలలో ఇప్పటికే రెండు కేసులు నమోదు చేశాం. ఎక్కడైనా డొమెస్టిక్ గ్యాస్ వాడకం జరిగితే మాకు ఫిర్యాదులు చేయాలి. అటువంటి వారిపై విచారణ చేసి చర్యలు తీసుకుంటాం.

-ఆర్ఎస్ఎస్ సత్యనారాయణరాజు, డిఎస్ఓ

తాళ్లపూడి పరీక్షా కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

పది పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు తెలుగు, సంస్కృతం పేపర్ 1 పరీక్ష నిర్వహించారు. 23,984 మంది విద్యార్థులకు 23,523 మంది హాజరయ్యారు. కలెక్టర్ పి.ప్రశాంతి, జెసి చిన్నరాముడు పలు పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. జిల్లా స్థాయి పరిశీలనాధికారి ఆరు పరీక్షా కేంద్రాలను, జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి 11 పరీక్షా కేంద్రాలను, తనిఖీ అధికార్లు 64 పరీక్షా కేంద్రాలను మొత్తంగా 84 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

చాగల్లు జిల్లా పరిషత్ హై స్కూల్ సెంటర్‌ను తహశీల్దార్ ఎం.మెరికమ్మ తనిఖీ చేశారు. ఈ సెంటర్‌లో 204 మందికి 200 మంది హాజరయ్యారని హెచ్ఎం విజయ్‌కుమార్ తెలిపారు. మార్కొండపాడు జడ్‌పిహెచ్ఎస్‌లో 73 మంది, ఊరగట్ల హై స్కూల్లో 101మందికి 99 మంది హాజరయ్యారిన ఎంఇఒ గురునాథం తెలిపారు. తాళ్లపూడి మండల పరిధిలోని మూడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు నాలుగు పరీక్ష కేంద్రాల్లో 678 మందికి 665 మంది హాజరయ్యారని, 13 మంది గైర్హాజరయ్యారని ఎంఇఒ-2 నెహ్రూజీ తెలిపారు. మలకపల్లి ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రాలను తహశీల్దార్ భారతి తనిఖీ చేశారు. ఉండ్రాజవరం మండలంలో 821 మందికి 817 మంది హాజరు కాగా, నలుగురు గైర్హాజరయ్యాని ఎంఇఒ-2 శారదా జ్యోత్స్న తెలిపారు. వేలివెన్ను పరీక్షా కేంద్రంలో ఎంఇఒ నాయక్ తనిఖీలు చేశారు. తహశీల్దార్ పిఎన్‌డి.ప్రసాద్ పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. గోకవరం మండలంలో మొత్తం 745 మంది విద్యార్థులకు 738 మంది హాజరయ్యారని ఎంఇఒ బి.గౌరమ్మ తెలిపారు.

రూమ్ నెంబర్లను పరిశీలించుకుంటూ...

శానిటరీ వర్కర్స్‌కు కార్మిక చట్టాలు అమలు చేయాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

కార్మిక చట్టాలు అమలు చేయాలంటూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలల, కళాశాల శానిటేషన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి బి.పూర్ణిమరాజు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తునన శానిటేషన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. సమాజంలో అట్టడుగున ఉన్న పేదలకు చెందిన వారు ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లో అనేక దశాబ్దాలుగా శానిటేషన్ కార్మికులుగా అతి తక్కువ రూ.6 వేల వేతనాలతో పనిచేస్తున్నారని తెలిపారు. వారికి కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు. ప్రతి నెలా 5వ తేదీ లోపు జీతాలు చెల్లించాలన్నారు. 300 మంది విద్యార్థులకు ఒక శానిటరీ వర్కర్‌ను మాత్రమే నియమించామన్నారు. దీంతో కార్మికులపైన పనిభారం పెరిగిందన్నారు. 50 మంది విద్యార్థులకు ఒక వర్కర్‌ను నియమించుకోవాలన్నారు. కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యాలు కల్పించాలని, రెండు జతల యూనిఫాం ఇవ్వాలని, చనిపోయిన కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డిస్ట్రిక్ట్ రెవిన్యూ ఆఫీసర్ టి.సీతారామమూర్తికి వినతి పత్రం అందించారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.సరోజ, బి.వేణు, ఎం.నందన, ఎం.శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న స్కూల్ శానిటేషన్ వర్కర్లు

జెవివి పోటీల విజేతలు వీరే...

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జెవివి ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన యురేకా సైన్స్ ఎక్స్‌పో-2025లో తూర్పుగోదావరి జిల్లా స్థాయి సైన్సు ప్రయోగ పోటీల్లో 'పర్యావరణం - సుస్థిర అభివద్ధి' విభాగంలో సీతానగరం మండలం రఘుదేవపురం జడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థి కె.భానుతేజ, కె.సత్యదుర్గ, నాగేంద్రకుమార్ బృందం ప్రథమ స్థానంలో నిలిచింది. అలాగే గాంధీపురం మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు కలిదిండి లహరి, కె.లతాజ్యోతి బృందం ద్వితీయ స్థానంలో నిలిచింది. 'సైన్స్ అండ్ టెక్నాలజీ' విభాగంలో రాజమహేంద్రవరం ఆనంద్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వి.అనిరుథ్, ఎం.దివాకర్, పి.మహేష్‌ల బృందం మొదటి, ఇదే పాఠశాలకు చెందిన పి.జ్యోతిలహరి, మండపరెడ్డి రమ్య ద్వితీయ స్థానలంలో నిలిచారు. 'మూఢ నమ్మకాలు, శాస్త్రీయ దృక్పథం' విభాగంలో రాజమహేంద్రవరం గాంధీ పురం మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మాజేటి వాసవ్, మండ జాయ్ విజేతలకుగా నిలిచారని జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.రవిబాబు తెలిపారు.

ఆశీలకు వేలం ఖరారు

చాగల్లు : చాగల్లు గ్రామ డైలీ మార్కెట్‌లో ఆశీల వసూలు కోసం రూ.4.30 లక్షలకు వేలం ఖరారైందని పంచాయతీ కార్యదర్శి మహ్మద్ అలీ తెలిపారు. సోమవారం చాగల్లు పంచాయతీ కార్యాలయంలో నిర్వ హించిన ఈ వేలానికి ఆరుగురు హాజరయ్యారు. జి.రామకృష్ణ రూ.4.30 లక్షలకు వేలం ఖరారు చేసుకున్నారు. ఈ ఏడాది రూ.30 వేలు అదనంగా ఆదాయం సమకూరిందని పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

కేన్సర్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం...

నన్నయ విసి ప్రసన్నశ్రీ

ప్రజాశక్తి - రాజానగరం

ఫార్మాస్యూటికల్స్‌లో నైట్రోసమైన్‌ల నిర్మూలిస్తూ కేన్సర్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని నన్నయ యూనివర్శిటీ విసి ఎస్.ప్రసన్నశ్రీ పిలుపునిచ్చారు. సోమవారం యూని వర్సిటీ కన్వెన్షన్ సెంటర్‌లో 'కంట్రోల్ ఆఫ్ నైట్రోసామినేష్ ఇన్ ఫార్మస్యూటికల్స్ అండ్ అనలిటికల్ టెస్టింగ్' అనే అంశంపై డిపార్టమెంట్ ఆఫ్ కెమిస్ట్రీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ సెమినార్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విసి ఎస్.ప్రసన్నశ్రీ, అమెరికాలోని సైజెన్ ఫార్మాసూటికల్స్ క్వాలిటీ ఇన్స్యూరెన్స్ డైరెక్టర్ డాక్టర్ విష్ణు మారిశెట్టి, నన్నయ యూనివర్సిటీ కెమిస్ట్రీ ఆచార్య బి.జగన్మోహనరెడ్డి, అమెరికాలోని కెమ్ టెక్స్ లాబొరేటరీస్ సైంటిస్ట్ డాక్టర్ నరేష్ కటారి, మాలేషియా ఐఎన్‌టిఐ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ప్రతినిధి డాక్టర్ వి.రవి, ఆంధ్ర యూనివర్సిటీ కెమిస్ట్రీ ప్రొఫెసర్ ఎస్.పాల్ డగ్లస్, ఎన్ఐటి కెమిస్ట్రీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అమరేందర్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ పి.విజయనిర్మల హాజరై జ్యోతిప్రజ్వలన చేసి సెమినార్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ "ఫార్మాస్యూటికల్స్ మరియు అనలిటికల్ టెస్టింగ్‌లో నైట్రోసమైన్‌ల నియంత్రణ" అనే అతి ముఖ్యమైన అంశంపై అంతర్జాతీయ సెమినార్‌ను నిర్వహించడం అభినందనీయమన్నారు. నైట్రోసమైన్‌ల వంటి కొన్ని విషపూరిత మలినాలు ఆందోళన కలిగించేవిగా నిరూపించ బడ్డాయన్నారు. కేన్సర్‌కు దారితీసే డిఎన్ఎని మారుస్తుందని చెప్పారు. రోగులు ఉపయోగించే ఔషధం కాబట్టి, రోగి భద్రత చాలా ఆందోళన కలిగిస్తుందన్నారు. నేడు ఫార్మాస్యూటికల్ ప్రపంచం రోగి ఆరోగ్యాన్ని కాపాడే నైట్రోసమైన్ ఫ్రీ మెడిసిన్‌ను అభివృద్ధి చేయడం ద్వారా అక్కడ నియంత్రణలను ఏర్పాటు చేయడానికి బమింగ్ టాపిక్‌పై పని చేస్తోందన్నారు. మందుల వాడకంలో లోపం కారణంగా తన స్నేహితురాలి ఇంట జరిగిన మరణాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు.

సెమినార్‌లో మాట్లాడుతున్న విసి ప్రసన్నశ్రీ

డాక్టర్ విష్ణు మారిశెట్టి 'కార్సినో జెనిక్ పొటెన్సీ క్యాలిక్యులేషన్స్ మరియు రిస్క్ మిటిగేషన్ అండ్ కంట్రోల్ ఆఫ్ నైట్రోసమైన్స్ ఇన్ ఫార్మలేషన్' అనే అంశంపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. బి.జగన్మోహనరెడ్డి మాట్లాడుతూ నైట్రోసమైన్స్ పరిచయం, ఔషధాల్లో నైట్రోసమైన్స్ ఉండే అవకాశాలను వివరించారు. సైంటిస్ట్ డాక్టర్ నరేష్ కటారి మాట్లాడుతూ నైట్రోసమైన్స్ ఫార్మేషన్ అండ్ ఎనలిటికల్ టెస్టింగ్ అనే అంశంపై అమెరికా నుంచి ఆన్‌లైన్ ద్వారా ఉపన్యసించారు. డాక్టర్ వి.రవి నైట్రోసమైన్ కంట్రోల్స్ ఇన్ డ్రగ్ సింథసిస్ అనే పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. నన్నయ యూనివర్సిటీ, గీతం యూనివర్సిటీ నుండి పెర్కిన్ ఎల్మర్ సంస్థల నుండి 12 మంది అభ్యర్థులు పోస్టర్ ప్రెజెంటేషన్ చేశారు. వీరికి సర్టిఫికెట్లను అందజేశారు. అతిథులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సెమినార్ కన్వీనర్ ఆచార్య బి.జగన్మోహన్ రెడ్డి, కెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ కె.దీప్తి, అధ్యాపకులు డాక్టర్ ఎస్.రామకృష్ణ, డాక్టర్ సిహెచ్.మురళీకృష్ణ, డాక్టర్ సిహెచ్.వెంకట పద్మరావు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మున్సిపల్ స్కూల్ ఆయాలు

జీతాలు పెంచాలని ఆయాల ధర్నా

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

మున్సిపల్ స్కూల్స్‌లో పనిచేస్తున్న పార్ట్ టైం టైం కాంటెంజెంట్ స్వీపర్లు(ఆయాలు)కు జీతాలు పెంచాలని రాజమహేంద్రవరం మున్సిపల్ కార్యాలయం ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.పవన్ మాట్లాడారు. అయాలకు కేవలం రూ.4 వేలు జీతంతో ఇచ్చి ప్రభుత్వం వెట్టి చాకిరి చేయిస్తుందని విమర్శించారు. 30 ఏళ్లుగా మున్సిపల్ పాఠశాలలో విద్యార్థులకు సేవలు అందిస్తున్నా వీరికి కనీస వేతనం ఇవ్వకపోవడంతో దుర్మార్గమన్నారు. ఇఎస్ఐ అమలు చేయాలని, రెండు జతల యూనిఫాం ఇవ్వాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. వెంటనే ఫుల్ టైమ్ కంటెంజెంట్ వర్కర్స్‌గా గుర్తించి జిఒ 193ను అమలు చేయాలని కోరారు. ప్రతినెలా 5వ తేదీ లోపు జీతం చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్కర్స్ ఝాన్సీ, శాంతి, దుర్గ, సత్యవతి, ప్రభావతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జవాబుదారీతనంతో సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కొవ్వూరు

పిజిఆర్ఎస్‌లో వచ్చి ప్రజా సమస్యలను అధికారులు జవాబుదారీతనంతో తక్షణం పరిష్కరించాలని కొవ్వూరు ఆర్‌డిఒ రాణిసుస్మిత ఆదేశించారు. ఆర్‌డిఒ కార్యాలయంలో సోమవారం జరిగిన డివిజన్ స్థాయి పిజిఆర్ఎస్‌లో ప్రజల నుంచి అర్జీలను ఆమె స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడారు. పిజిఆర్ఎస్‌లో అన్ని శాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు తక్షణం పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నాలుగు అర్జీలు వచ్చాయని ఆమె తెలిపారు. చాగల్లు మండలానికి చెందిన సుంకపల్లి శ్రీనివాసరావు అనే వ్యక్తి తన స్థలం ఆక్రమణకు గురైందని అది తిరిగి ఇప్పించడమే కాకుండా తనకు ప్రాణ రక్షణ కల్పించాలని అర్జీ ఇచ్చారు.కొవ్వూరు మండలం తోగమ్మి గ్రామానికి చెందిన వి. విజయ్ అనే వ్యక్తి కూడా తన తన స్థలం ఆక్రమణకు గురివిందని దీనిపై విచారణ చేయాలంటూ అర్జీ ఇచ్చారు.

'నాంది' ద్వారా లైఫ్ స్కిల్స్‌లో శిక్షణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో మార్చి 17 నుంచి మార్చి 22 వరకు కళాశాలకు చెందిన మహిళా విద్యార్థులకు సాఫ్ట్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్‌లో నాంది ఫౌండేషన్ మహీంద్రా ప్రైడ్ క్లాస్ రూమ్, స్కిల్ డెవలప్మెంట్ వారి సహకారంతో శిక్షణ అందిస్తున్నామని ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర తెలిపారు. కళాశాలలో జరిగిన ప్రారంభ సభలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రస్తుత ఉన్న పోటీ ప్రపంచంలో విద్యార్థులకు ఈ శిక్షణ చాలా అవసరమన్నారు. ప్రతి విద్యార్థీ ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కళాశాల స్కిల్ ట్రైనింగ్ కో-ఆర్డినేటర్ బి.వెంకటరావు మాట్లాడుతూ కళాశాలలో మొదటి బ్యాచ్‌గా 50 మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. కళాశాల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కో-ఆర్డినేటర్ నూజిళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ శిక్షణలో ట్రైనర్ వి.చైతన్య సాఫ్ట్ స్కిల్స్‌లో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా బి.వెంకటరావు రచించిన రెండు కెమిస్ట్రీ టెక్స్ బుక్స్‌ను ప్రిన్సిపాల్ ఆవిష్కరించారు. ఈ శిక్షణను స్కిల్స్ డెవలప్మెంట్ ట్రైనర్ పద్మావతి, కళాశాల ప్లేసెమెంట్ ట్రైనర్ ఎం.కిరణ్ కుమార్ లు పర్యవేక్షించారు.

కార్టూ'నిజం'

న్యాయవాదులకు శిక్షణా తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

నగరంలోని జిల్లా కోర్టులో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సమావేశ మందిరంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని 36 మంది న్యాయవాదులకు మధ్యవర్తిత్వం, రాజీ ప్రాజెక్ట్ కమిటీ (ఎంసిపిసి) ఆధ్వర్యంలో 'మధ్యవర్తిత్వం కాన్సెప్ట్, టెక్నిక్‌ల'పై ఐదు రోజుల పాటు ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహించ నున్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఎంసిపిసి ఇద్దరు మాస్టర్ ట్రైనర్స్ అధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. జ్యుడీషియల్ అధికారులకు, అడ్వకేట్లకు ఈ శిక్షణ అందిస్తున్నామన్నారు. 17వ తేదీ నుంచి 21 వరకూ నిర్వహిస్తామన్నారు. విశాఖపట్నంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి, ఇతర న్యాయమూర్తులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమాల్లో పాల్గొన్నామన్నారు. ఇందులో పలు అంశాలపై అవగాహన కల్పించారని తెలిపారు. ఎంసిపిసి యాక్ట్ ప్రకారం-2023 ప్రొవిజన్ ప్రకారం జ్యుడీషియల్ అధికారులకు, అడ్వకేట్లకు శిక్షణ అందించినట్లు తెలిపారు. కోర్టు సంబంధిత కేసుల్లో పరిష్కారం కోసం నాలుగు విధానాలు ఉన్నాయన్నారు. ఇందులో మధ్యవర్తిత్వం రాజీ మార్గం, లోకాదళత్ కూడా రెండు అంశాలుగా ఉన్నాయని తెలిపారు.

జ్యోతిప్రజ్వలన చేస్తున్న జిల్లా ప్రధాన న్యామూర్తి సునీత

మధ్యవర్తిత్వంకు సూచించిన కేసులకు సంబంధించి కేసు పరిష్కారం అయ్యే విధంగా శిక్షణ పొందిన జ్యుడీషియల్ అధికారులు, అడ్వకేట్లను నామినేట్ చేస్తామన్నారు. వీరు సంబంధిత కేసులో ఇరు పార్టీలను పిలిచి వారితో ఆమోదయోగ్యం దిశగా సంతకాలు చేయించి ఆరు నెలల లోపు కేసు పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకుంటారన్నారు. కోర్టుకు చెల్లించిన ఫీజు కూడా తిరిగి ఇస్తామన్నారు. ఈ విధానం ద్వారా త్వరితగతిన కేసులు పరిష్కారం అయ్యే అవకాశం ఉందన్నారు. ఈ శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని, ఏవైనా సందేహాలుంటే నివృత్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఇన్‌ఛార్జి కార్యదర్శి ఎస్‌కె.జానీభాషా, సీనియర్ మాస్టర్ ట్రైనీలు ఆర్.విజయకమల, ఆర్.రత్నతారా పాల్గొన్నారు.

శ్రీసత్యదేవా నర్సరీ సందర్శించిన గిరీష్‌కుమార్‌సంఘీ

ప్రజాశక్తి-కడియం

సంఘీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత డాక్టర్ గిరీష్ కుమార్ సంఘీ సోమవారం కడియం మండలం కడియపులంకలో గల శ్రీసత్యదేవా(పుల్లా వీర వెంకట్రావు) నర్సరీని సందర్శించారు. సత్యదేవా నర్సరీ అధినేత, ఐఎన్ఎ మాజీ కార్యదర్శి పుల్లా వీరవెంకట్రావు ఆయనకు స్పైడర్ లిల్లీ (మలేషియా) అనే కొత్తరకం మొక్కను ఇచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సంఘీ మాట్లాడుతూ భారతదేశంలోనే అత్యంత గుర్తింపు పొందిన నర్సరీ అయిన సత్యదేవ నర్సరీని సందర్శించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తమకు కావాల్సిన కొన్ని ఫల, పుష్ప మొక్కలను కొనుగోలు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పుల్లా శ్రీకాంత్, పి.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పూడిక తీయించాలని తీర్మానం

ప్రజాశక్తి - పెరవలి

అన్ని పంటకాలువల్లో పీడిక తీయించాలని పెరవలి వాటర్ డిస్ట్రిబ్యూటరీ సమావేశం తీర్మానించింది. నీటి వినియోగదారుల సంఘాల అధ్యక్షుల సమీక్ష సమావేశం డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్మన్ బూరుగుపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన సోమవారం పెరవలి లాక్ కాంపౌండ్ ప్రాంగణంలో జరిగింది. ఈ సమావేశంలో పెరవలి వాటర్ డిస్ట్రిబ్యూటరీ పరిధిలోని నీటి వినియోగం, వ్యవసాయ నీటి సమస్యలు, వాటి పరిష్కార మార్గాలు తదితర అంశాలపై చర్చించారు. అన్ని సంఘాల అధ్యక్షులు పలు సూచనలు ఇచ్చారు. పెరవలి లాక్ కాంపౌండ్ పరిసరాలను శుభ్రం చేసి, మొక్కలు నాటాలని, అన్ని సంఘాల పరిధిలోని కాలువల్లో చెత్త, పూడిక తొలగించాలని, అవసరమైన ప్రాంతాల్లో గోడలు నిర్మించడం, మరమ్మతులు చేయించడం వంటి పనులు చేపట్టాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో డిఇఇ నర్సాపురం వెంకటనారాయణ, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్.బాలమురళీకృష్ణ, వివిధ నీటి సంఘాల అధ్యక్షులు గుణ్ణం పట్టాభిరామ్, నందిన వెంకటేశ్వరరావు, నల్ల బాస్కరరావు, నల్ల సురేంద్ర, అడ్డగాళ్ల శ్రీరామమూర్తి, రామదాసు, మల్లుల బాస్కరరావు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

సమావేశంలో పాల్గొన్న నీటి సంఘాల అధ్యక్షులు

నేరాలు ఘోరాలు

చోరీకి గురైన ధాన్యం స్వాధీనం

ప్రజాశక్తి - గోకవరం

గోకవరం మండలం రంప ఎర్రంపాలెం గ్రామానికి చెందిన గంటా బుల్లి వెంకటేశులు గోకవరం గ్రామం, రంప ఎర్రంపాలెం గ్రామాల మధ్యన పొలం కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నారు. వరికుప్పను నూర్చి ధాన్యాన్ని మూటలుగా కట్టి రోడ్డు పక్కన బరాకల్లో ఉంచడాడు. ఈ నెల 11వ తేదీ అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఈ ధాన్యాన్ని దొంగిలించారు. దీంతో వెంకటేశులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ పవన్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. దేవీపట్నం మండలం ఇందుకురిపేటకు చెందిన సత్తినాటి వీరబాబును నిందితునిగా గుర్తించారు. విచారించగా నేరం అంగీకరించాడు. బెట్టింగులకు అలవాటు పడి అప్పులు కావడంతో ఈ చోరీకి పాల్పడినట్టు గుర్తించామన్నారు. ఆటోపై గోకవరం పరిసర ప్రాంతాల్ల తిరుగుతూ రోడ్డు పక్కన ఉంచిన సుమారు 70 క్వింటాలు వరి ధాన్యం దొంగిలించాడని గుర్తించామన్నారు. ప్రస్తుతం వీరబాబు నుంచి ఒక ఆటో, 14 క్వింటాళ్ల ధాన్యాని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ధాన్యాన్ని రైతు వెంకటేశులుకి అప్పగించామని తెలిపారు.

బంధన్ బ్యాంకులో ఘరానా మోసం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

తమ బ్యాంకులో నుంచి గ్రూపులోన్ ఇప్పిస్తామని నమ్మబలికి బ్యాంకు సిబ్బంది లక్షలు కాజేసి పరారైన వైనం రూరల్ మండలం వలసపాకల గ్రామంలో చోటుచేసుకుంది. బాధితరాలు ఏడిద సూర్యకుమారి, రగత చిన్న అమ్ములు తెలిపిన వివరాల ప్రకారం...వలసపాకల గ్రామంలో ఉన్న బంధన్ బ్యాంక్‌లో పది లక్షలు లోన్ ఇప్పిస్తామని నమ్మించి ఏడిద సూర్యకుమారి నుంచి రూ.1.45 లక్షలు, రగత చిన్న అమ్ములు దగ్గర నుంచి రూ.2.30 లక్షలను బంధన్ బ్యాంక్ రికవరీ మేనేజర్ గణేష్, ఉదయ భాస్కర్‌లు తీసుకున్నారన్నారు. ఆ సొమ్మును వేరే అకౌంట్ లోకి మళ్ళించారన్నారు. ఎంతకీ తమకు లోన్ మంజూరు కాకపోవడంతో బంధన్ బ్యాంక్ మేనేజర్ సూరిబాబుకి ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. తాము అప్పులు చేసి ఆ డబ్బులు సమకూర్చి వారికి ఇచ్చామని, ఇప్పుడు ఆ డబ్బులు పోయి లోన్ కూడా రాకపోవడంతో తమ పరిస్థితి ఏంటని బాధితులు గగ్గోలు పెట్టారు. దీనిపై బంధన్ బ్యాంక్ మేనేజర్ సూరిబాబు మాట్లాడుతూ తమకు వచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేయగా దాదాపు 70 మందిని బ్యాంకు రికవరీ బృందం మోసం చేసి రూ.6 లక్షల వసూలు చేసినట్లు గుర్తించామని తెలిపారు. రికవరీ స్టాఫ్ గణేష్ పరారీలో ఉన్నట్టు ఆయన తెలిపారు. ఈ విషయంపై ఉన్నతాధికారుల సూచనల మేరకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

పంట కాలువలో గుర్తు తెలీని వ్యక్తి మృతదేహం

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

అమలాపురం-చల్లపల్లి ప్రధాన పంట కాలువలో సోమవారం గుర్తుతెలియని ఒక వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు వెలికి తీశారు. మృతుని వయసు సుమారు 50 నుంచి 55 ఏళ్ల వయసు ఉంటుందని ఎస్ఐ సిహెచ్.రాజేష్ తెలిపారు. విఆర్ఒ డి.శైలజ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

యువతి అదృశ్యం

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలోని భీమోలు గ్రామపంచాయతీ శివారు తొక్కిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన నక్క కిషోర్ బాబు కుమార్తె నక్క చాందిని అదృశ్యమైంది. ఆదివారం రాత్రి రెండు గంటల నుంచి కనిపించట్లేదని తల్లి గంగ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ కె.సతీష్‌కుమార్ తెలిపారు. ఆచూకీ తెలిసినవారు 9440796665 లేదా 9393007753 నెంబర్‌కు సమాచరం ఇవ్వాలన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - గోపాలపురం

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతి చెందినట్లు ఎస్ఐ కె.సతీష్‌కుమార్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కొవ్వూరి నాగిరెడ్డి(60) తన ఇంటి నుంచి గోపాలపురం సెంటర్‌కు నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ సమయంలో గుర్తు తెలియని వాహనం వెనక నుంచి ఢీకొట్టి పోయింది.. తీవ్రంగా గాయపడిన అన్ని స్థానికులు గుర్తించి గోపాలపురం ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. మతుని కుమారుడు కొవ్వూరి జయంత్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ కె.సతీష్‌కుమార్ తేలిపారు.

గవర్నర్‌ను కలిసిన విసి

కాకినాడ : జెఎన్‌టియుకె విసి సిఎస్‌ఆర్‌కె.ప్రసాద్ సోమవారం గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను విజయవాడ రాజ్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. యూనివర్శిటీలో చేపడుతున్న అభివృద్ధి విద్యాపరమైన అంశాలు, త్వరలో నిర్వహించనున్న విశ్వవిద్యాలయ స్నాతకోత్సవ వేడుకల నిర్వహణను గవర్నర్‌కు వివరించారు. రాష్ట్రంలో జెఎన్‌టియుకెకు ప్రత్యేక గుర్తింపు ఉందని, సాంకేతిక విద్యలో రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలకు, విద్యా సంస్థలకు ఆదర్శంగా ఉండేలా తీర్చిదిద్దాలని గవర్నర్ సూచించినట్లు విసి తెలిపారు. యూనివర్శిటీలో చేపడుతున్న మౌలిక వసతుల కల్పన, భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని కూడా ఆదేశించారని తెలిపారు.

జూనియర్ కాలేజీ ఏర్పాటు చేయాలి

తుని : కోటనందూరు మండలం పాత కొట్టాంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని మంత్రి నారా లోకేష్‌ను ఎంఎల్‌ఎ యనమల దివ్య కోరారు. ఈ మేరకు సోమవారం ఆమె ఓ ప్రకటనను విడుదల చేశారు. పాత కొట్టాం, కొత్త కొట్టాం, లక్ష్మీదేవి పేట, అల్లిపూడి, కెఇ.చిన్నయ్యపాలెం పూర్తిగా వెనుకబడిన ప్రాంతమని, అలాగే అనకాపల్లి జిల్లా నాతవరం మండలానికి చెందిన గునుపూడి, పికె.గూడెం, చిన్నగొడుగుండుపేట, పెద్ద గొలుగొండపేట, వెదురుపల్లి గ్రామాలకు చెందిన విద్యార్థులు 450 నుంచి 500 వరకు ఉన్నారని, వారికోసం పాత కొట్టాంలో జూనియర్ కాలేజ్ ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఎస్టిమేట్స్, ప్రతిపాదనలతో కూడిన లేఖను మంత్రికి అందజేసినట్లు తెలిపారు.

పరిస్థితి అదుపులోనే ఉంది

డయేరియా ప్రభావిత ప్రాంతాల్లో 10 బృందాల పరిశీలన

కలెక్టర్ పి.ప్రశాంతి, ఎంఎల్‌ఎ మద్దిపాటి

ప్రజాశక్తి - గోపాలపురం

గోపాలపురం మండలంలో డయేరియా కేసులు అదుపులో ఉన్నాయని ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ పి.ప్రశాంతి, ఎంఎల్‌ఎ మద్దిపాటి వెంకటరాజు తెలిపారు. మండలంలో డయేరియా కేసులు నమోదైన గ్రామాల్లో వారు పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ పరిస్థితుల్లో మార్పులు, ఉష్ణోగ్రతలు పెరగడం తదితర కారణాలతో పలువురు డయేరియా బారిన పడ్డారన్నారు. ఇప్పటివరకు 25 మందికి చికిత్స అందించారన్నారు. 20 మందిని డిశ్చార్జ్ చేశామన్నారు సోమవారం కొత్తగా నాలుగు కేసులు నమోదయ్యాయని తెలిపారు. ప్రస్తుతం 9 మంది చికిత్స పొందుతున్నారన్నారు. వారి ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు. అనుమానస్పద డయారియా కేసులను గుర్తించేందుకు ఇంటింటా సర్వేను చేపడుతున్నట్లు తెలిపారు. డయేరియా ప్రభలడానికి గల కారణాలను తెలుసుకుంటామన్నారు. బాధతుల రక్త నమూనాలను ల్యాబ్‌లకు పంపి పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే డయేరియా ప్రాభావిత ప్రాంతాల్లో వాటర్ ట్యాంకులు, స్టోరేజ్ ప్రాంతాలను క్లోరినేషన్ చేశామని తెలిపారు. ప్రజలకు అవసరమైన ఒఆర్ఎస్ ప్యాకెట్లు ఇతర అత్యవసర మందులను అందుబాటులో ఉంచామన్నారు. ఎంఎల్‌ఎ మద్దిపాటి వెంకటరాజు మాట్లాడుతూ , సిఎం ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో పర్యటించామన్నారు.

రోగులను పరామర్శిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, ఎంఎల్‌ఎ మద్దిపాటి

బాధితులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. చికిత్స పొందుతున్న బాధితులతో మాట్లాడామని, వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు. నీటి నమూనాలను పరీక్షల నిమిత్తం పంపామన్నారు. పరిస్థితి పూర్తిగా అదుపులోకి వచ్చేవరకు అధికారులు క్షేత్రస్థాయిలోనే అందుబాటులు ఉంటారన్నారు. వారి వెంట ఆర్‌డిఒ రాణిసుస్మిత, డిఎంహెచ్‌ఒ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, డిసిహెచ్ఎస్ డాక్టర్ ఎన్‌పి.పద్మశ్రీ, ఆర్డబ్ల్యుఎస్ అధికారి బివి.గిరి, డిపిఒ వి.శాంతామని తదితరులున్నారు.

పిజిఆర్‌ఎస్‌కు అధికారులందరూ హాజరవ్వాలి

జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ప్రతి సోమవారం నిర్వహించే పిజిఆర్‌ఎస్‌కు అన్ని శాఖల అధికారులు హాజరవ్వాలని, ప్రజల నుంచి అర్జీలు, ఫిర్యాదులు స్వీకరించాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ పిజిఆర్‌ఎస్ సమావేశ మందిరంలో జెసి ఎస్.చిన్నరాముడుతో కలిసి ఆమె ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ద్వితీయ శ్రేణి అధికారులు, సిబ్బందిని పంపి అర్జీలను స్వీకరించడం, వాటిపై సరైన అవగాహన లేకుండా పరిష్కారం చేసినట్లు పేర్కొనడం వల్ల ఒకే అర్జీపై పలుమార్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అర్జీ పరిష్కారం బాధ్యత అధికారులపైనే

అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ ప్రశాంతి

ఉంటుందన్నారు. కంప్యూటర్ ఆపరేటర్, గుమాస్తా స్థాయిలో పరిశీలన చేసి టేబుల్ వర్క్ చర్యలు ఉపేక్షించడం తగదన్నారు. క్షేత్ర స్థాయిలో క్రాస్ చెక్ చేసుకుని మాత్రమే పరిష్కారం దిశగా అడుగులు వేయాలని స్పష్టం చేశారు. కలెక్టర్, జెసి స్థాయిలో తమకు వచ్చే అర్జీలను క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించి అందుకు అనుగుణంగా ఉత్తర్వులు ఇస్తున్నట్లు తెలిపారు. ఇదే రకమైన పనితీరు జిల్లా అధికారుల నుంచి ఆశిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పిజిఆర్‌ఎస్ కార్యక్రమాన్ని చేపట్టిందని, ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఇకపై కచ్చితంగా ఆయా శాఖలకు చెందిన అర్జీలు పరిష్కారం చేసి, వాటిపై ప్రజలతో మాట్లాడి సంతృప్తి స్థాయి తెలుసుకునే ప్రయత్నం చేయాలన్నారు. రీ సర్వే, భూ సర్వే కొలతలు, రేషన్ కార్డులు, పెన్షన్ మంజూరు కోసం అర్జీలు అందించామన్నారు. సోమవారం 181 అర్జీలు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

ప్రజాశక్తి - నిడదవోలు

ఆంధ్రరాష్ట్ర అవతరణకు మూలపురుషుడు అమరజీవి పొట్టి శ్రీరాములుకు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జువ్వల రాంబాబు ఘనంగా నివాళులర్పించారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా గాంధీబొమ్మ సెంటర్లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్ర కోసం ప్రాణత్యాగం చేసిన శ్రీరాములు స్ఫూర్తినీయుడన్నారు. పొట్టి శ్రీరాములు జీవితంలో పలు ఘట్టాలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. పొట్టిశ్రీరాములు స్ఫూర్తినీయుడు అని ఈ సందర్భంగా కొనియాడారు. ఆయన్ని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గారపాటి ప్రసన్నకృష్ణ, వెంకటేశ్వరరావు, థామ్సన్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఎంప్లాయీస్ సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

రిటైర్డ్ ఎంప్లాయీస్ సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పల్లా సత్యనారాయణమూర్తి విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ పి.ప్రశాంతిని సోమవారం కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందించారు. సమర్పించారు. ఈ సందర్భంగా సత్యనారాయణమూర్తి మాట్లాడారు. విశ్రాంత ఉద్యోగులకు 2023 జులై 1 నుంచి 13వ వేతన సవరణ కమిటీ వేయాలన్నారు. తాత్కాలిక భృతి ప్రకటించాలని, పెరుగుతున్న నిత్యావసరాల ధరలు దృష్టిలో పెట్టుకొని కరువుభత్యం బకాయిలు చెల్లించాలన్నారు. వైద్యం అందక, నగదు చెల్లించలేక పెన్షనర్లు పడుతున్న ఇబ్బందులు గ్రహించి నగదు రహిత వైద్య సేవలు అందించాలన్నారు. 70 ఏళ్లు నిండిన వారికి పది, 75 ఏళ్లు నిండిన వారికి పదిహేను శాతం అదనపు క్వాంటమ్ చెల్లించేవారని గుర్తు చేశారు. తర్వాత వచ్చిన జగన్ ప్రభుత్వం అన్ని విధాలుగా కోతలు విధించిందన్నారు. గతంలో మాదిరిగా క్వాంటమ్ తిరిగి పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బండి సూర్య ప్రకాశరావు, జిల్లా నాయకులు కామేశ్వర శర్మ, యర్రమోతు ధర్మరాజు, దాసరి సాయిబాబు, బండారు రవీంద్ర, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు వి. వెంకటేశ్వర్లు, సుబ్బారావు, సూర్యారావు, వెంకట రత్నం తదితరులు పాల్గొన్నారు,

విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఎసిటి సైన్స్ సెంటర్‌లో సోమవారం లూథరన్ హైస్కూల్ 6వ తరగతి విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలపై అవగాహన కల్పించారు. సైన్స్ సెంటర్ నిర్వాహకులు బుద్ధా శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పిండి పదార్థాల పరీక్ష, మాంసకృతుల, కొవ్వుల పరీక్షలు, ఏ ఏ వస్తువులు ఏ ఏ పదార్థాలతో తయారవుతాయి, కరిగేవి, కరగనివి, మునిగేవి, తేలివి, వడపోత వంటి ప్రయోగాలు విద్యార్థులతో చేయించారు. తూర్పు గోదావరి జిల్లా కోరుకొండ

ప్రయోగాలు చేస్తున్న విద్యార్థులు

మాజీ ఎంపిపి బుద్ధా వెంకట రమణమూర్తి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు సంతోష్ రూ.20 వేలు విలువ చేసే ఫ్యూజి ఫిల్మ్ కెమెరాను సైన్స్ సెంటర్‌కు బహుకరించినట్లు బుద్ధా శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా అల్లంరాజు చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ రామశాస్త్రి దాత సంతోష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

'నిట్'ను సందర్శించిన ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం

ఆర్ట్స్ కళాశాలలో భౌతిక శాస్త్ర పీజీ విద్యార్థులు తాడేపల్లిగూడెంలోని నిట్ విద్యాలయాన్ని సోమవారం సందర్శించారు. నిట్, ఆంధ్రప్రదేశ్ అధ్యాపకులు ప్రొఫెసర్. పి.తపస్, ప్రొఫెసర్ జె.కృష్ణమూర్తి, ప్రొఫెసర్ ఎం.రాముడు విద్యార్థులకు పదార్థ పరిశోధనా పద్ధతులు, ఉన్నత విద్య అవకాశాలను వివరించారు. ఈ కార్యక్ర మంలో భౌతికశాస్త్ర విభాగాధిపతి సిహెచ్.కోమల లక్ష్మి, కె.వెంకటేశ్వరరావు, బి.గౌరీనాయుడు, బి.హరినాథ్‌రెడ్డి, జె.నిరంజనరావు పాల్గొన్నారు.

కండక్టర్ ప్రసాద్ కథకి మరో పురస్కారం

ప్రజాశక్తి - గోపాలపురం

విశాలాక్షి సాహిత్య మాసపత్రిక నిర్వహించిన మినీ కథల పోటీలో ప్రసాదరావు రాసిన 'మానవ మగం' కథ బహుమతికి ఎంపికైంది. ఆదివారం నెల్లూరులోని టౌన్ హాల్లో జరిగిన సన్మాన సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న శాసన సభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ చేతుల మీదుగా కౌలూరి ప్రసాదరావుకి ఘన సత్కారం చేశారు. అమరావతి కృష్ణారెడ్డి అధ్యక్షతన ఈ సన్మాన సభ నిర్వహించారు. విశిష్ట అతిథిగా మాజీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ డాక్టర్ ఎ.విద్యాసాగర్ పాల్గొన్నారు. ప్రత్యేక అతిథిగా కవి, రచయిత ఎంవి.రామిరెడ్డి పాల్గొన్నారు. విశాలాక్షి తరపున పబ్లిషర్ క్రోసూరు రత్నం ,ఎడిటర్ ఈతకోట సుబ్బారావు మూడు విభాగాల్లో బహుమతులు ప్రకటించారు. జడపల్లె పెంచలయ్య, సుబ్బమ్మ స్మారక కథల పోటీ, సివిఎస్.మహేశ్వర్ స్మారక మినీ కథల, కవితల పోటీ, కొమర్రాజు వెంకట మోహనరావు, పద్మావతి గార్ల స్మారక కథల పోటీల విజేతలు పురస్కారాలు అందుకున్నారు. గోపాలపురం మండలం, వేళ్ళచింతలగూడెం గ్రామానికి చెందిన డాక్టర్ కౌలూరి ప్రసాదరావు, జంగారెడ్డిగూడెం ఆర్‌టిసి డిపోలో కండక్టరుగా పనిచేస్తున్నారు.

ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ఎపిఎస్ ఆర్‌టిసిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందించారు. రాజమమేంద్రవరం డిపో ఆవరణలో సోమవారం ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ జరిగింది. ఈ కార్యక్రమంలో డిపోలో అత్యధిక కెఎంపిఎల్ తెచ్చిన ముగ్గురు డ్రైవర్లకు, అత్యధిక ఇపికె తెచ్చిన నలుగురు కండక్టర్లకు, ఇద్దరు డ్రైవర్లకు అదే విధంగా ప్రతిభ కనబరిచిన గ్యారేజీ సిబ్బంది ఇద్దరికి డిఎం ప్రశంసాపత్రాలతో పాటు నగదు బహుమతులు అందించారు. అదేవిధంగా అత్యధిక కుంభమేళాకు స్పెషల్ బస్సులు బుక్ చేసినందుకుగాను డ్రైవర్ ఎవి.రావును, కుంభమేళాకు క్షేమంగా వెళ్లి వచ్చిన డ్రైవర్లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ అజయ్‌బాబు, అసిస్టెంట్ ఇంజినీర్ నాగలక్ష్మి, మేనేజర్ మూర్తి , ట్రాఫిక్ సిబ్బంది, గ్యారేజీ సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది, ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

విసి ప్రసన్నశ్రీకి శుభాకాంక్షలు

ప్రజాశక్తి - దేవరపల్లి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విసి ప్రసన్నశ్రీని జనసేన గోపాలపురం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి డి.సువర్ణ రాజు, ప్రిన్సిపల్ బిడిఎన్ కుమార్, అధ్యాపక సిబ్బంది సోమవారం కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని విసి వారికి సూచించారు. భవిష్యత్తులో కళాశాల అభివృద్ధికి సహకారం అందిస్తానని విసి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జువాలజీ అధ్యాపకులు వెంకట్రావు, కామర్స్ అధ్యాపకులు సత్య, సూపరింటెండెంట్ మోహన్ రావు పాల్గొన్నారు .

మహారాజశ్రీ కాకినాడ 3వ అదనపు జిల్లా జడ్జివారి కోర్టులో
I.A. 1732/2024, ASSR. 7024/2024
Between:
ఆదిరెడ్డి నాగ వీర సత్యనారాయణ రామ్ కుమార్ ...పిటీషనరు
మరియు
యానాల శ్రీనివాస్ ...రెస్పాండెంటు
To, **యానాల శ్రీనివాస్,** తండ్రి - తాతారావు (లేటు) వయస్సు 32 సం॥ ప్రైవేట్ ఎంప్లాయ్, డో॥నెం. 5-184 కిల్లి వారి వీది, నడకుదురు, కరప మండలం, కాకినాడ జిల్లా.
ప్రకటన:
పైన తెలిపిన కోర్టులో మీ హాజరు నిమిత్తం చివరి సారిగా **ది. 20-03-2025 సం॥ తేదీన పై కోర్టులో ఉదయం గం. 10-30 ని॥లకు** మీరు స్వయంగా గాని మీ తరుపున ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయ్యి మీ ఆక్షేపణలు ఏమైన ఉన్న యెడల, శ్రీ కోర్టు వారికి తెలియజేయవలెను. లేని యెడల సదరు తీర్పు మీ పరోక్షమందు తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.
మర్ల నరసింహారావు, అడ్వకేట్
డో.నెం.1-9-7, శ్రీరామ్ నగర్,
కాకినాడ - 533 003.
కాకినాడ
ది.17-3-2025 సెల్ : 9848277373

మహారాజశ్రీ కాకినాడ 4వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
O.S. No. 56/2015
Between :
దెయ్యాల రాంబాబు & అదర్స్ ...వాదులు
మరియు
దెయ్యాల అప్పారావు & అదర్స్ ..ప్రతివాదులు
(To ప్రతివాదులు):-
D.21 : బట్రాజు కరుణ కుమారి, W/o. గోవింద రాజులు, డో.నెం. 4-51, గొల్లపేట, ఇంద్రపాలెం గ్రామం, కాకినాడ రూరల్, కాకినాడ.
D.22 : చింతపల్లి సూర్యకళ రాజలక్ష్మి, W/o. వీరవెంకట నారాయణరెడ్డి, డో.నెం. 9-44, జయప్రకాశ్ నగర్, తూరంగి, కాకినాడ రూరల్, కాకినాడ. ...21,22 ప్రతివాదులు
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
పై నెంబరు దావాలో 21 మరియు 22 ప్రతివాదులు అయిన మీరు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు / నోటీసులు పంపినా, మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 21-03-2025 తేది ఉదయం 10-30 ని॥లకు** మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
అద్దేపల్లి మురళీధర్
వాదుల తరపు అడ్వకేట్
ప్రతాప్ నగర్, కాకినాడ
కాకినాడ.
ది.17-03-2025 సెల్: **9849170270**

ప్రకటన
ది జాంపేట కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, రాజమహేంద్రవరం సెక్రటరీ గారి సంజాయిషీపై యావన్మందికి తెలియజేయునది ఏమనగా, పెద్దాపురం వాస్తవ్యులు శ్రీ బొమ్మాడ వెంకటేష్ గారి భార్య శ్రీమతి బొమ్మాడ తులసి గారు సదరు బ్యాంక్‌లో ఋణము కొరకు దరఖాస్తు చేసుకున్నారు. వారు **ది. 11-11-2024, డాక్యుమెంట్ నెం. 11802/2024** గా షేక్ అబ్దుల్ ఖాదర్ జిలాని గారు వగైరాల వలన టి.ఎస్. నెం. 2-6-340 లో డో.నెం. 8-12-17/1 డాబా ఇల్లు కొనుగోలు చేసి సదరు ఆస్తిపై ఋణ దరఖాస్తు చేసుకున్నారు. అయితే సదరు షేక్ అబ్దుల్ ఖాదర్ జిలాని గారి వారి భార్య షేక్ జరినా బేగం గారు ది. 30-10-2023 తేదీన మరణించిన తరువాత దఖలు పడగా వారు విక్రయించినారు. అయితే దస్తావేజులో షేక్ జరీనా బేగం అని Death Certificate లో షేక్ జరీనా అని యన్నది. కావున వారి పేరు విషయంలో ఆస్తి విషయంలో ఎవరికైనా అభ్యంతరాలు ఉన్నట్లు అయితే 10 రోజుల లోపు సదరు బ్యాంక్ వారికి వ్రాత పూర్వకంగా తెలుపవలెను. లేనిచో సదరు బ్యాంక్ వారు బొమ్మాడ తులసి గారి ఋణ దరఖాస్తు స్వీకరించబడునని తెలియజేయడమైనది.
పి.మృత్యుంజయరావు
అడ్వకేట్, డో.నెం. 11-6-7
పెద్దాపురం, సెల్: 9848113611

బహిరంగ ప్రకటన
తూర్పుగోదావరి జిల్లా, కడియం మండలం, మురమండ గ్రామ డోరు నెం. 7-10రు కాపురస్తులు పోలోతు రామారావు గారి కుమారుడు పోలోతు సురేష్ అను నేను ప్రమాణముపై దాఖలు చేసుకున్న అఫిడవిట్ కమ్ ఇండెమినిటీ బాండు సంగతులు ఏమనగా,
తూర్పుగోదావరి జిల్లా, కడియం మండలం, మురమండ గ్రామం తాలూకు స్థిరాస్తికి సంబంధించిన శెటిల్‌మెంటు విడుదల దస్తావేజు ద.నెం. 139/2025 రుకు లింకు క్రయ దస్తావేజు నెం. 1032/2020 రు మిస్ అయినది. దాసరా నాగేశ్వరరావు వగైరాల వల్ల క్రియం పొందినటు వంటి క్రయ దస్తావేజు అయివున్నది. సదరు ద.నెం. 139/2025 రుకు లింకు దస్తావేజు అయివున్నది. సదరు పైన వివరించబడిన లింకు క్రయ దస్తావేజును పోగొట్టుకున్న విషయమును గురించి పోలీసు వారికి కంప్లైంట్ చేయడం కూడా జరిగినది. అలాగే ది. 18-03-2025వ సం॥రం తేదీన ప్రజాశక్తి న్యూస్ పేపర్ నందు దస్తావేజు పడిపోయినవని ప్రకటన కూడా యిచ్చియున్నాను. గనుక సదరు పై విషయములు అన్నియూ యదార్థములు అనియూ, సదరు విషయములు భవిష్యత్తులో అవాస్తవములని తెలియ వచ్చిన యెడల మీరు నాపై జరిగించు చట్టపరమైన చర్యలకు మరియు ఐ.పి.సి. 199/200 రు ప్రకారం నాపై మీరు తీసుకొని చర్యలకు నేను పూర్తి బాధ్యత వహించగలనని యిందుమూలముగా తెలియజేయుచున్నాను.
ఎన్.తాతారెడ్డి, అడ్వకేట్/ నోటరీ
రామచంద్రాపురం రామచంద్రాపురం
ది.17-3-2025 సెల్: 98866 960337

యానాం వార్తలు

యానాంలో పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు, వారి తల్లీదండ్రులు

ప్రశాంతంగా పది పరీక్షలు

ప్రజాశక్తి - యానాం

10వ తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా మొదలయ్యాయి. స్థానిక రీజన్సీ పబ్లిక్ స్కూల్లో రెండు సెంటర్లను ఏర్పాటు చేశారు. సెంటర్ ఎలో 230 మంది విద్యార్థులు, సెంటర్ బిలో 193 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు తగిన చర్యలు చేపట్టారు. అలాగే పరీక్షా కేంద్రం వద్ద పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

మిల్క్ బాయిలర్స్‌కు త్వరలోనే జీతాల పెంపు...

ప్రజాశక్తి - యానాం

ఎంఎల్ఎ శ్రీనివాస అశోక్

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మిల్క్ బాయిలర్స్‌కు త్వరలో జీతాలను రూ.18 వేలకు ప్రభుత్వం పెంపుదల చేయనున్నట్టు ఎంఎల్‌ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ సమావేశంలో జీతాల పెంపు విషయంపై విద్యా శాఖా మంత్రి నమశ్శివాయంను అసెంబ్లీలో ప్రశ్నించగా జీతాల పెంచే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారని వివరించారు. ఇప్పటికే సంబంధిత ఫైలు ఎల్‌జి దగ్గర ఉందని, వారం రోజుల్లోనే జీతాల పెంపుకు సంబంధించి ఉత్తర్వులు జారీచేయడం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి రంగసామి కూడా జీతాల పెంపుపై హామీ ఇచ్చారని తెలిపారు. యానాం ప్రభుత్వ ఆసుపత్రిలో యుపిఎస్‌సి ద్వారా వైద్యులను నియమించే విధంగా ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందని తెలిపారు. ప్రస్తుతం వైద్యులను కాంట్రాక్టు పద్ధతిలో నియమించడం వద్ద అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, రోగులకు సరైన వైద్యం అందడం లేదని ప్రశ్నించనట్టు తెలిపారు. శాశ్వత ప్రాతిపదికన యుపిఎస్‌సి ద్వారా పూర్తిస్థాయిలో వైద్యుల నియామకానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని అసెంబ్లీలో కోరినట్టు తెలిపారు.

కల్పనా చావ్లాకు నివాళి

ప్రజాశక్తి - తాళ్లపూడి

జీవితంలో ఏదైనా సాధించాలనే తపనతో చిన్నతనం నుంచి విమాన బొమ్మలు గీస్తూ భారతదేశ తొలి అంతరిక్ష మహిళా యాత్రికురాలుగా పేరొందని కల్పనా చావ్లాను నేటి విద్యార్థులకు ఆదర్శంగా తీసుకోవాలని రాగోలపల్లి ఎంపిపి పాఠశాల హెచ్‌ఎం దున్నా దుర్గారావు అన్నారు. కీర్తి చావ్లా జయంతి సందర్భంగా సోమవారం పాఠశాల ఆవరణలో ఆమె చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ విద్యార్థులకు కీర్తి చావ్లా జీవిత విశేషాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు విద్యార్థులతో పాటు పేరెంట్స్ కమిటీ సభ్యులు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ కార్యాలయం, మలికిపురం
టెండరు ప్రకటన
ఆర్.క.నెం.8/2025 తేది.10-03-2025
డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, మలికిపురం మండలం, మలికిపురం గ్రామపంచాయతీనకు ఈదిగువ నుదహరించిన సామాగ్రి సరఫరా చేయుటకు గాను సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. టెండర్లు దాఖలునకు 20-03-2025 సం॥రం తేదీ గురువారం మధ్యాహ్నం గం॥ 3.00ల వరకు మాత్రమే సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. తదుపరి ఏవిధమైన టెండర్లు స్వీకరించబడవు. అదేరోజు మధ్యాహ్నం గం॥ 3.30లకు అప్పటికి హాజరైన టెండరుదార్ల సమక్షములో సీల్డు టెండర్లు తెరువబడును. టెండరు దాఖలు చేయగోరువారు ఈదిగువ చూపిన విధముగా ధరావత్తు చెల్లించి క్రమమైన రసీదు పొంది టెండరునకు జతపరచవలెను. ధరావత్తు కట్టని టెండర్లు స్వీకరించబడవు. మిగిలిన వివరములకై కార్యాలయం పనిచేయు వేళలలో సంప్రదించవలెను.

వ.నెం.	వివరములు	కాలపరిమితి	ధరావత్తు
1	పబ్లిక్ హెల్త్ సామాగ్రి	ది.01-4-2025 నుండి 31-3-2026 వరకు	200/-
2	స్టేషనరీ	ది.01-4-2025 నుండి 31-3-2026 వరకు	200/-
3	బుక్స్ & ఫారమ్స్	ది.01-4-2025 నుండి 31-3-2026 వరకు	200/-
4	వీధి లైట్లు రిపేరియర్	ది.01-4-2025 నుండి 31-3-2026 వరకు	200/-
5	ఆర్.డబ్ల్యూ.యస్. పైపు లైను విడిభాగములు	ది.01-4-2025 నుండి 31-3-2026 వరకు	200/-

గమనిక: పంచాయితీ సాధారణ నిధుల నిల్వలను బట్టి ప్రాధాన్యత క్రమములో చెల్లింపులు జరుపబడును.
సం/- **గెద్దం రాజ్యలక్ష్మి**, సర్పంచ్, గ్రామపంచాయితీ, మలికిపురం
సం/- **ఐ.సుభాకరబాబు,** పంచాయితీ కార్యదర్శి, గ్రామపంచాయతీ, మలికిపురం

గ్రామ పంచాయతీ కార్యాలయము - ఇంద్రపాలెం
టెండరు నోటీసు
ఆర్.క.నెం. 20/2024-25 తేది:18-03-2025
కాకినాడ రూరల్ మండలం, ఇంద్రపాలెం గ్రామపంచాయితీకు సంబంధించి 2025-2026 ఆర్థిక సంవత్సరములో గ్రామపంచాయితీ నిధులతో ఈ దిగువ తెలిపిన విధంగా అవసరమైన కాంట్రాక్టు పద్ధతిపై పారిశుధ్య కార్మికుల సేవలు చేయుటకు, మరియు రక్షిత మంచినీరు, పారిశుధ్య పనిముట్లు, పబ్లిక్ హెల్త్ కలరా మందులు, స్టేషనరీ అండ్ బుక్స్ & ఫారమ్స్ మరియు ఎలక్ట్రికల్ విడి భాగములు వగైరా సప్లయి కొరకు గాను సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. సదరు సీల్డు టెండర్లు ఈ దిగువ సంతకము చేసిన వారిచే గాని, లేదా వారి యొక్క అనుమతి పొందిన వారిచే గాని ది.27-03-2025 గురువారము మధ్యాహ్నం 12:00 గంటల వరకు తీసుకొనబడి, అదే రోజు మధ్యాహ్నం 02:00 గంటలకు అప్పటికి హాజరైన టెండరు దార్ల సమక్షంలో సీల్డు టెండర్లు తెరవబడును. సీల్డు టెండర్లు దాఖలా చేయుటకు చెల్లించవలసిన ధరావత్తు పంచాయతి కార్యదర్శి, గ్రామపంచాయతీ, ఇంద్రపాలెం వారి పేరున చెల్లుబాటు అగు విధముగా డి.డిలు /MR ద్వారా గాని చెల్లించి, చెల్లించిన రశీదును టెండరు షెడ్యూలునకు జతపరచి సీల్డు కవరు ద్వారా టెండరు సమర్పించవలెను. టెండరు షెడ్యూల్స్ ది.26-03-2025వ తేది సాయంత్రం 5:00 గంటల వరకు మాత్రమే ఇవ్వబడును. పై నిబంధనలు పాటించని టెండర్లు మరియు సకాలంలో రాని టెండర్లు స్వీకరించబడవు. టెండరు షెడ్యుళ్ళ రేటు, టెండరు షరతులు, ఇతర వివరములు ఈ కార్యాలయం పనిచేయువేళలో వచ్చి తెలుసుకొనవలెను. గ్రామ పంచాయితీ నిధుల లభ్యతను బట్టి బిల్లులు చెల్లించబడును మరియు ఎట్టికారణము చూపకుండానే టెండర్లను వాయిదా వేయుటకు గాని రద్దుపరుచుటకు గాని పంచాయితీ కార్యదర్శివారికి పూర్తి అధికారము గలదు.

వ.నెం.	టెండరు కాల పరిమితి	వివరములు	చెల్లించవలసిన టెండరు ధరావత్తు (మనిషి ఒక్కింటికి)
1.	01-04-2025 నుండి 31-03-2026 వరకు	కాంట్రాక్టు శానిటరీ మేస్త్రి సేవలు -2	100/-
2.	01-04-2025 నుండి 31-03-2026 వరకు	కాంట్రాక్టు PWS ఆపరేటర్ సేవలు -1	100/-
3.	01-04-2025 నుండి 31-03-2026 వరకు	కాంట్రాక్టు లైబ్రరియన్ సేవలు -1	100/-
4.	01-04-2025 నుండి 31-03-2026 వరకు	కాంట్రాక్టు కంప్యూటర్ ఆపరేటర్ సేవలు -1	100/-
5.	01-04-2025 నుండి 31-03-2026 వరకు	కాంట్రాక్టు బిల్ కలెక్టర్ సేవలు -2	100/-
6.	01-04-2025 నుండి 31-03-2026 వరకు	కాంట్రాక్టు డ్రైన్ క్లీనర్ సేవలు -3	100/-
7.	01-04-2025 నుండి 31-03-2026 వరకు	కాంట్రాక్టు పారిశుధ్య పని స్వీపర్ల సేవలు -26	100/-
8.	01-04-2025 నుండి 31-03-2026 వరకు	కాంట్రాక్టు ఎద్దు సప్లై దారు సేవలు -1	100/-
9.	01-04-2025 నుండి 31-03-2026 వరకు	కాంట్రాక్టు కార్టు డ్రైవర్ సేవలు -1	100/-
10.	01-04-2025 నుండి 31-03-2026 వరకు	కాంట్రాక్టు ట్రాక్టర్ డ్రైవర్ సేవలు -2	100/-
11.	01-04-2025 నుండి 31-03-2026 వరకు	కాంట్రాక్టు బరియల్ గ్రౌండ్ వాచ్‌మెన్ సేవలు -1	100/-
12.	01-04-2025 నుండి 31-03-2026 వరకు	రక్షిత మంచినీరు సరఫరా విడిభాగములు సప్లై	500/-
13.	01-04-2025 నుండి 31-03-2026 వరకు	పారిశుధ్య పనిముట్ల సప్లై	500/-
14.	01-04-2025 నుండి 31-03-2026 వరకు	పబ్లిక్ హెల్త్ కలరా మందులు (బ్లీచింగ్, ముగ్గు, పినాయిల్, దోమల మందులు వగైరా)	500/-
15.	01-04-2025 నుండి 31-03-2026 వరకు	స్టేషనరీ, బుక్స్ అండ్ ఫారములు సప్లై కొరకు	500/-
16.	01-04-2025 నుండి 31-03-2026 వరకు	ఎలక్ట్రికల్ సామానులు, LED లైట్లు విడి భాగములు, LED లైట్లు ఫిట్టింగులు సప్లై	500/-

పైన పట్టిక నందు తెలిపిన సేవలకు మరియు వివిధ సామానుల సప్లై కొరకు టెండర్లు కోరడమైనది.
పంచాయతీ కార్యదర్శి, గ్రామ పంచాయితీ, ఇంద్రపాలెం, కాకినాడ రూరల్ మండలం
సం/- **ప్రత్యేక అధికారి**, గ్రామ పంచాయితీ, ఇంద్రపాలెం, కాకినాడ రూరల్ మండలం